క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: ఎస్సీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుల కోసం 2024–25 విద్యాసంవత్సరం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి శ్వేతా ప్రియదర్శిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి ద్వారా ఆర్థిక సమాయం టోఫెల్, జీఆర్ఈ, జీఎంఏటీ, ఐఈఎల్‌టీఎస్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు యూఎస్ఏ, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, సింగపూర్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ దేశాల్లోని పేరొందిన విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31లోగా ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు చింతలకుంటలో వాల్మీకి విగ్రహప్రతిష్ఠ

కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంటలోని నూతనంగా నిర్మించిన వాల్మీకి ఆలయానికి శుక్రవారం విగ్రహప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు వాల్మీకి ఆలయ పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు స్వామి ఊరేగింపు 11:55కు విగ్రహ ప్రతిష్ఠ మధ్యాహ్నం 1గంటలకు భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమానికి మండల వాల్మీకి సోదరులు, వివిధ గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న టీకాల కార్యక్రమం

అయిజ: పశువులకు వచ్చే థైలెరియోసిస్ వ్యాధులను నివారించేందుకు థైలెరియా వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని మండలంలో వెటర్నరీ సిబ్బంది కొనసాగిస్తున్నారు. గురువారం మండలంలోని ఉత్తనూరు, పర్దీపురం గ్రామాల్లో పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. 425 పశువులకు టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

గట్టు: మండలంలోని వాయిల్‌కుంట పంచాయతీ కార్యదర్శిగా పని చేసి బదిలీపై వెళ్తున్న వేణుగోపాల్‌ను గ్రామ యువకులు శుక్రవారం సన్మానించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్యదర్శి వేణుగోపాల్‌ను గ్రామ యువకులు సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు గోపాల్, సోమ్లానాయక్, సుబ్బయ్యానాయక్, శీను నాయక్, శంకర్,కృష్ణస్వామి, హనుమంతు, రాజ్‌కుమార్, గణేష్‌నాయక్, అన్నారంనాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు గాను, 14 గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు చేపట్టారని, మిగితా రెండు గ్రామాలకు కార్యదర్శులు రాలేదని ఎంపీఓ పద్మావతి తెలిపారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: దాడి విషయంలో ఇరువర్గాలపై కేసు నమోదైన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ స్వాతి వివరాల ప్రకారం.. మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన సుజాత, రవీంద్రబాబు కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం ఇంటి ముందు చెత్తను ఊడ్చే విషయంలో ఒక రికొకరు గొడవపడి దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇరు వర్గాల కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అయిజ: మండల కేంద్రానికి చెందిన సిల్వర్ గోపాల్, ఆయన కుమారుడు పవన్‌కళ్యాణ్ రెండు లారీలలో ఎండుమిర్చిని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మార్కెట్‌కు తీసుకెళ్తుండగా, గురువారం తెల్లవారుజామున గుంటూరు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఎస్ఐ వీరనారాయణ వివరాల ప్రకారం.. అయిజ పట్టణానికి చెందిన తండ్రీకొడుకులు సిల్వర్ గోపాల్, పవన్ కళ్యాణ్ వడ్డేపల్లి మండలంలోని తనగల నుంచి రెండు టాటా ఏసీ వాహనాల్లో ఎండుమిర్చి లోడ్‌తో గుంటూరు బయలదేరారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం వద్ద టాటా ఏసీ వాహ నం రోడ్డు పక్కన నిలిపిన మరో లారీని ఢీకొట్టింది. దీంతొ డ్రైవర్ నంద్యాల జిల్లా గడివేలముల మండలం ఉజనూర్‌కు చెందిన సుబ్బారావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పవన్‌కళ్యాణ్‌కు కుడికాలు విరిగింది. వెనకాల లారీలో వెళ్తున్న సిల్వర్ గోపాల్ కొడుకును వెంటనే గుంటూరు ఆస్పత్రికి తరలించాడు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

రాజోళి: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ స్కీంలో పని చేస్తున్న కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నాలుగు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జోగుళాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా జీతాలు లేక సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారని, అప్పులు చేసి కుటుంబ పోషణ చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఈ సిబ్బందికి వేతనాలు లేకపోవడంతో రోజురోజు గండంగా గడపాల్సిన పరిస్థితి ఉందని, ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరారు.

అన్నీతానై.. కుటుంబానికి తోడై..

- కుటుంబ పోషణకు కూలిపనులకు..
- నడుములు విరిగిన భర్త మంచానికే పరిమితం..
- విద్యార్థి దశలో పిల్లలు..
- ఆమె లేకుంటే సాగని బతుకుబండి


ఎద్దుల బండిని పొలానికి సిద్ధం చేస్తున్న లలితమ్మ

రేపటికి ముందడుగు

ఉండవెల్లి: ఇంట్లో భర్త పనిచేసి భార్యను సుఖంగా చూసుకునే రోజులున్నాయి. కానీ భర్త మంచానికే పరిమితమవడంతో భార్యనే అన్ని తానై చూసుకుంటు కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. మండలంలోని తక్కశిల గ్రామానికి చెందిన ఆంజనేయులు, లలితమ్మ దంపతులు వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మొదటి సంతానం పురుషోత్తం. కుమార్తె వసంత, రామ్ ప్రసాద్ ఉన్నారు. పెద్ద కుమారుడు వనపర్తి గురుకులాలో 9వ తరగతి, కుమార్తె ఉండవెల్లి మైనార్టీ గురుకులాల్లో చదువుతున్నారు. చిన్న కుమారుడు గ్రామంలోనే 6వ తరగతి చదవుతున్నాడు. భర్త ఆంజనేయులుకు ఐదేళ్లక్రితం రోడ్డు ప్రమాదంలో నడుములు విరిగాయి. ఆపరేషన్ చేయించిన ఫలితం లేదు. అతని పరిస్థితి మంచానికే పరిమితమైంది. దీంతో కుటుంబ భారమంతా ఆమెపై పడింది. సొంత పొలం రెండెకరాలు సాగుచేసుకుంటు, కూలి పనులకు పోయి జీవనం సాగిస్తోంది. మరిదికి చెందిన ఎద్దుల బండిపై వెళ్లి తమ పొలం పనులు చూసుకుంటోంది. ఏమి చదువుకోలేదు. కాని ఆమె లేకుంటే జీవనం లేదని నిరూపిస్తోంది.


మంచంపై భర్త ఆంజనేయులు

ఎవరు ఆదుకోరు.. పట్టించుకోరు



మా భర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాను. మా పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తాను. పస్తులు ఉండి మరి పోషిస్తున్నాను. ప్రతి మహిళ భర్తకు అండగా ఉంటుంది. కాని ఆపద వచ్చిన ఆదుకోవాలి. మగవాళ్లు ఉంటేనే బతకగలమనేది తప్పు. మహిళలు కుటుంబాన్ని పోషిస్తుంది. కానీ మా భర్తకు వీల్ చైర్ కూడా లేని పరిస్థితిలో ఉన్నాం. పంటలు కూడా నష్టపోయాం.

– లలితమ్మ, తక్కశిల, వ్యవసాయ కూలి

పేద కుటుంబంలో మెరిసిన ఆణిముత్యం


తల్లిదండ్రులు, తమ్ముడుతో జాబిలి

అయిజ: పేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివి డాక్టర్‌గా పరిణతి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి 23 సంవత్సరాల 'జాబిలి' అయిజ పట్టణానికి చెందిన కె.రవిప్రకాష్, మాధవీలత దంపతుల కూతురు. వీరిది పేద కుటుంబం తండ్రి కా ర్పెంటర్‌గా పనిచేస్తూ తన కూతురు జాబిలిని, కొడుకు తరుణ్‌ను చది విస్తున్నాడు. జాబిలి చిన్నప్పటి నుంచి చుదవుల సరస్వతిగా పేరు గాంచింది. 10వ తరగతి అయిజ పట్టణంలోని బ్రైట్ స్టార్ పాఠశాలలో చదివింది. ఇంటర్ నిజాంపేటలో శ్రీ చైతన్యలో పూర్తి చేసి ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీట్ సాధించింది. మహబూబ్ నగర్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం హౌస్ సర్జన్‌గా పనిచేస్తోంది. పీజీ చదివి జనరల్ సర్జ న్ కావాలనేది ఈమె లక్షం.

మంచి డాక్టర్‌గా పేరు తెచ్చకుంటాను



మా తల్లిదండ్రుల సహకారంతో ఎంబీబీఎస్ దిగ్విజయంగా పూర్తి చేశాను పీజీ పూర్తిచేసి న్యూరోసర్జన్‌గా చేయాలని ఉంది. పేద ప్రజలకు వైద్యం చేసి, మా తల్లిదండ్రుల శ్రమకు ప్రతిఫలంగా మంచి డాక్టర్‌గా పేరు తెచ్చుకుంటాను. పేద కుటుంబంలో పుట్టిన నేను సమస్యలను లెక్క చేయకుండా ముందుకు సాగాను. నా పురోగతికి సహాయపడిన వారిలో చాలామంది మహిళలు ఉన్నారు. వారందరికి మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు.

– జాబిలి, ఎంబీబీఎస్, అయిజ

విద్యతోనే చైతన్యం..



రాజోళి: ప్రతి యువతి చదువుకోవడం వల్లనే చైతన్యం వస్తుంది. ఇప్పటికీ చాలా గ్రామాల్లో మహిళల పట్ల, బాలికల విద్య పట్ల వివక్ష కొనసాగుతోంది. స్కూల్ స్థాయిలోనే బాలికల చదువును ముగించేస్తున్నారు. ప్రతి అ మ్మాయి ఉన్నత విద్యను అభ్యసించినట్లైతే భవిష్యత్‌లో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురైనా ఒంటరిగా పోరాడే శక్తి వస్తుంది. విద్యను మించిన ఆయుధం లే దు. అమ్మనాన్నలు ఆలోచన చేసి బాలికల భవిష్య త్ కు బాసటగా నిలవాలి. సాంకేతికంగా ముందుకు దూ సుకెళ్తున్న క్రమంలో వివక్షలు, మూడనమ్మకాలు, బా ల్యవివాహాలు చాలా దారుణం . నన్ను మా అమ్మనాన్న ఎంతో ఉన్నతమైన చదువులు చదివిస్తున్నారు. వారిలాగానే ప్రతి తల్లిదండ్రులు అమ్మాయిల విద్యకు బంగారు బాటలు వేయాలి. మా మిత్రులతో కలిసి మేము ఇలా చాలా మందిలో చైతన్యం కలిగిస్తున్నాం.

– ప్రత్యూష, వైద్యవిద్యార్థి, రాజోళి

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


మహిళా అధ్యాపకురాలిని సన్మానిస్తున్న అధ్యాపకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా మాట్లాడారు. మహిళలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం సాంస్కృతిక ఫెస్టివల్‌లో భాగంగా ఫ్యాషన్ షో, ఫుడ్ ఫెస్టివల్, క్లాసికల్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల మహిళా అధ్యాపకురాలు, సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ లవీన మంజులత, సీనియర్ అధ్యాపకులు కృష్ణమూర్తి ఉన్నారు.

నేటి నుంచి అరణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


గుట్టపై వెలసిన అరణ్యేశ్వరస్వామి

ధరూరు: శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని కోతులగిద్ద అరణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 8 నుంచి 9వ తేదీ వరకు రెండు రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న గుట్టపై వెలసిన అరణ్యేశ్వర స్వామి ఉత్సవాలకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు సైతం హాజరై తమ మొక్కులు తీర్చుకుంటారు.

8వ తేదీన సుప్రభాత సేవ, బిల్వార్చన, గణపతిపూజ, రుద్రాభిషేకం, రుద్ర హోమం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆదేరోజు రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు స్వామివారి ఉచ్చాయ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

దళితులు ఓటు విలువ తెలుసుకోవాలి

ధరూరు: ఆయా పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంటారని, దళితులు మోసపోకుండా ఓటు విలువ తెలుసుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మార్లబీడు ప్రకాష్ అన్నారు. గురువారం మండలం లోని గార్లపాడులో అంబేడ్కర్ జ్ఞాన సభ, గ్రామ కమిటీ ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి పండుగను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా రాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా జంగిలప్ప, కార్యదర్శిలుగా జనార్దన్, శివరాజ్, చిన్న ఆంజనేయులు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చేనేత పార్కును నిర్మించాలని వినతి


డిప్యూటీ సీఎం, మంత్రిని కలిసిన నాయకులు

గద్వాల అర్బన్: గద్వాల మండలం అనంతపురం శివారులో చేనేత పార్కు నిర్మాణానికి 50 ఎకరాల భూమి కేటాయించి గత బీఆర్ఎస్ నిధులు కేటాయించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిర్మాణానికి కృషి చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం, తెలంగాణ ప్రాంతీయ పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. అలంపూర్‌లోని జోగుళాంబ అమ్మవారి సన్నిధిలో వసతిగృహం, అన్నదాన సత్రం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిపాటి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గట్టు వీరన్న ఉన్నారు.

పశుసంపదతోనే వ్యవసాయాభివృద్ధి

శాంతినగర్: పాడి, పశుసంపద ఎక్కువుంటేనే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని పశువైద్యశాల డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో రెండోరోజు గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా రైతులతో డాక్టర్ మాట్లాడారు. పశుసంపదను జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రభుత్వం ఉచితంగా అందించే టీకాలు తప్పనిసరిగా వేయించాలని రైతులు, పశుపోషకులకు డాక్టర్ సూచించారు. 58 మంది రైతులకు చెందిన 448 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వరప్రసాద్, లతీఫ్, రవికిరణ్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ

గట్టు: కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని గురువారం జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ బృందం (డీఈసీ) సభ్యులు హృదయరాజు, పద్మావతిలు తనిఖీ చేశారు. 8వ రోజున నిర్వహిస్తున్న పరీక్షలను జిల్లా బృందం సభ్యులు తనిఖీ చేశారు. గట్టులో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 311 మంది విద్యార్థులకు, 310 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి కృష్ణవర్ధన్‌లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు బాలకృష్ణ, శ్రీరాములు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం 48 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణలు తెలిపారు.

కలుగోట్లలో వైద్యశిబిరం

ఉండవెల్లి: మండలంలోని కలుగొట్లలోని రైతువేదికలో ఎస్‌బీఐ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ఎస్‌బీఐ ఫౌండేషన్ వారు 162 మంది గర్భిణులలో, 60 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. గైనకాలజిస్ట్ అమతూల్ మరియమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ పరిమళ, పీఈటీ అరుణతార, ఎస్‌బీఐ ఫౌండేషన్ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

శివలింగం ఏర్పాటు

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం కూడళిలో చతుర్ముఖ శివలింగాన్ని క్రేన్ సహాయంతో హైదరాబాద్ గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్, శ్రీనివాస్ రాజు అనే దాతలు, భక్తుల సహకారంతో అలంపూర్ పుణ్యక్షేత్రాలను తిలకించేందుకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిన్ని కృష్ణయ్య, ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ పాల్గొన్నారు.

మెడికల్ అధికారిని నియమించండి

అయిజ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెడికల్ అధికారిని నియమించాలని గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ శశికళకు వినతిపత్రం అందజేసినట్లు ఎంపీపీ ప్రహ్లాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అయిజ మున్సిపాలిటీ, మండలంలో కలిపి మొత్తం జనాభా లక్షకు పైగా ఉందని, పీహెచ్‌సీలో ప్రతిరోజు 100కు పైగా ఓపీలు వస్తుంటాయని, ఒక కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ మాత్రమే పనిచేస్తుండడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు డీఎంహెచ్‌ఓకు తెలిపినట్లు పేర్కొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డిగేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక విద్య స్థాయి నుంచే స్టేజ్ ఫీయర్ లేకుండా ప్రవర్తిస్తే ఉన్నత విద్యతో పాటు ఉన్నత పదవులు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతమ్మ, అయ్యన్న, శశికళ, భోగేశ్వరయ్య, సురేష్, ఎంవీఎఫ్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డిలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న జడ్జి గంట కవితాదేవి

గద్వాల అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జడ్జి గంట కవితాదేవి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సత్యసాయి డిగ్రీ, పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మాకం బీచుపల్లి, ప్రిన్సిపాల్ మాకం వీనిల బాలరాజు, వైస్ ప్రిన్సిపాల్ నర్సింహులు, అద్యాపకులు జ్యోతి, పారిజాత, సునీత, శారద, ఆర్షియా ఉన్నారు..

సామాజిక మార్పుతోనే విజయం


గద్వాల బస్టాండ్ ఆవరణంలో కేక్ కట్ చేస్తున్న డిపో మేనేజర్, ప్రయాణికులు

గద్వాల క్రైం: తమ హక్కులను గుర్తించి మహిళా సమానత్వం, సాధికారత, సామాజిక మార్పుతోనే ప్రతి మహిళ అన్ని రంగాల్లో విజయం సాధిస్తుందని గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ మంజులారెడ్డి అన్నారు. గురువారం బస్టాండ్ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇంటా, బయట మహిళలు ఎదుర్కొనే సమస్యలు, మహిళల పునరుత్పత్తి హక్కులు, లైంగిక దోపిడీలాంటి సమస్యల వలయంలో ఎందరో మహిళలు ఉన్నారన్నారు. ఇలాంటి వాటిపై ప్రతి ఒక్కరు చైతన్యం కావాల్సిందిగా పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం మహిళల దినోత్సం నిర్వహించడం కంటే ప్రతి క్షణం లింగ వివక్ష లేకుండా అందరు సమానమేని గుర్తిస్తే ఎంతో ఆనందమన్నారు. మారుతున్న కాలనుగుణంగా సామాజిక మార్పుతో విజయలు సాధిస్తామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పలు విషయాలపై సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ప్రయాణికులు తదితరులు ఉన్నారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి


ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ కమలాదేవి

అయిజ: మహిళలు అన్ని రంగాలలో స్వయం శక్తితో ఎదుగాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ కమలాదేవి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో రాజ్‌కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు మున్సిపల్ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు ఫిట్నెస్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో రాజ్‌కుమార్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు రత్నకుమారి మహిళలతో సమావేశం నిర్వహించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాజకుమార్ స్వచ్ఛంద సంస్థ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ని ర్వహిస్తోందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శశికళ

అయిజ: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ శశికళ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాత్రి సమయంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించడంలేదని సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయని, దానికి సంబంధించిన కారణాలను తెలుపాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు మాట్లాడుతూ తమ పరిధి మేరకు వైద్య సేవలు అందిస్తామని, పరిధి దాటితే వైద్యం అందించలేమని, పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేస్తామన్నారు కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ సిద్దప్ప, జిల్లా మాస్ మీడియా అధికారి మధుసూదన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ ఓబులేష్, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు


పూజలకు సిద్ధమైన భీమలింగేశ్వర ఆలయం.

గద్వాల: జిల్లాలో అన్ని శైవక్షేత్రాలు శుక్రవారం రోజు శివనామ స్మరణతో మార్మోగనున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శివాలయాలతో పాటు శైవక్షేత్రాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తెలుగుపేట కాలనీలోని వీరభద్రస్వామి, కన్యకాపరమేశ్వరి, నందీశ్వర, భీమలింగేశ్వర ఆలయాలలో తెల్లవారుజాము నుంచే శివునికి రుద్రాభిషేకం, బిల్వపత్ర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నదిఆగ్రహారంలోని స్పటిక లింగం పూజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. నల్లకుంట కాలనీలోని శివాలయంలో రాత్రి పది గంటలకు లింగోద్భవ అభిషకం నిర్వహించనున్నారు.

వైభవంగా పల్లకీ సేవ...

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక తెలుగుపేట కాలనీలలో పార్వతి, పరమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో చెపట్టిన పల్లకీ సేవ వైభవంగా సాగింది.

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం..

నల్లకుంట శివాలయం, పాండురంగ శివాలయంతో పాటు పలు శివాలయాలల్లో శనివారం పార్వతీ, పరమేశ్వరుల కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని అన్ని శివాలయాలు మహాశివరాత్రి సందర్భంగా ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయాన్ని గురువారం శివస్వాములు ముస్తాబు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, అర్చకులు ఆంజనేయశర్మ, శివస్వాములు ముఖేష్, మందిప్‌రెడ్డి, పాల్గొన్నారు.

గట్టు: మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబు అవుతున్నాయి. శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోనున్నారు. కోట్లగేరిలోని బంగారు బసవేశ్వర దేవాలయం, బస్టాండ్ ఆవరణలోని శివాలయం, వీరభద్రస్వామి ఆలయాలను శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్నారు. శివమాల ధరించిన మాలదారులు వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు.

జాతరకు ముస్తాబవుతున్న ఆలయం

రాజోళి: మండల కేంద్రం రాజోళిలో ఈ నెల 11నుంచి జరిగే జాతర ఉత్సవాలకు బ్రమరాంబ ఆడివేశ్వర స్వామి ఆలయం ముస్తాబవుతోంది. జాతరకు రాష్ట్రంతో పాటు కర్ణాటక, ఏపీ నుంచి భక్తులు వస్తారు. ఆలయ పరిసరాలు శుభ్రం చేయడంతో పాటుగా, ఆలయాన్ని శుభ్రం చేసి రంగులు వేశారు. తోరణాలు కట్టి, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం


నగదును అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

గద్వాల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు కుటుంబానికి ఫుట్‌బాల్ అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ సభ్యులు పెద్ద మనసుతో దాతృత్వం చాటుకుటున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు సమద్ మృతి చెందాడు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి ఫుట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారులు తమకు తోచిన రీతిలో సాయం అందించారు. గురువారం రూ.లక్ష రూపాయల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అసోసియేషన్ తరఫున జిల్లా అధ్యక్షుడు బండల వెంకట్రాములు అందజేశారు. కుమారుడి విద్యాభ్యాసం కోసం ఎర్రవల్లి సరస్వతి హైస్కూల్ ముందుకొచ్చింది. పదో తరగతి వరకు ప్రతి ఏడాది రూ.పది వేలు అందజేస్తామని పాఠశాల యాజమాన్యం శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు ప్రకటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాండు, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను పెంచండి

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ఉపాధి కూలీలను పెంచాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలను పెంచి వారికి పని కల్పించాలని ఆదేశించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా అని రకాల చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

అయిజ: మండలంలోని ఉత్తనూరులో గురువారం పంచాయతీ రాజ్ శాఖ ఏఈ లక్ష్మన్న ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించిన రూ.5 లక్షల నిధులతో 110 మీటర్ల దూరం సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జయన్న, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రాముడు ఉన్నారు.

ప్రజలపక్షాన పోరాడడమే బీఎస్పీ లక్ష్యం

గద్వాల అర్బన్: ప్రజల పక్షాన పోరాటమే బీఎస్పీ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అతిఖు ర్ రహ్మాన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అఖిల పక్షాలు బలంగా ఉన్నప్పుడే ప్రజల పక్షాన పోరాడి హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోరాగలుతామన్నారు. గత ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగానే పోటీ చేసిందన్నారు. పొత్తులో భాగంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీలు కలిసి ముందుకెళ్తాయని తెలిపారు. ప్రత్యేక కార్యచరణతో బీఎస్పీ, బీఆర్ఎస్‌తో కలిసి పని చేస్తామన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు ఉన్నారు.